
# ఇల్లు - పెళ్ళి

ఐ.ఎన్.శ్రీనివాసరావు



"దొరికిందా?" అన్నాను ఆత్రంగా ఆయనింకా ఇంట్లోకి అడుగు పెడుతూండగానే.

ఆలూపుతూ సోఫాలో కూలబడ్డారు.

"ఎక్కడ?" ఈ సారి మా అమ్మాయి.

"అమీర్‌పేటలోనే!"

"థాంక్యూ, డాడీ!" అన్నాడు మావాడు ఆనందం పట్టలేక.

"కాపిని మంచినీళ్లిస్తారా?" అన్నారాయన కొంచెం విసుగ్గా.

"అయ్యో, మర్చేపోయానండీ!" అంటూ నాలుక్కొరుకుంటూ వంటింట్లోకి పరుగెత్తాను.

నీళ్లు తాగి కళ్లు మూసుకుంటూ వెనక్కి జారబడ్డాడాయన.

అసలు ఇల్లు మారడమంటే ఆయనకి చాలా చిరాకు. వీధులన్నీ తిరగటం, బ్రోకర్లని పట్టుకోవడం, ఇంటి ఓనర్స్ పెట్టే షరతులన్నిటికీ తలూపడం, ఆ ఇల్లు మా అందరికీ నచ్చడం వరకూ ఒక వంతయితే ... ఇక ఆ తరువాత అన్నీ పాక్ చేయటం, ట్రాన్స్‌పోర్ట్, మళ్లీ కొత్త ఇంట్లో ఇవన్నీ సర్దుకోవటం, మార్పులూ, చేర్పులూ ... గాస్, రేషన్ కార్డ్, ఫోన్ కనెక్షన్ ... అన్నీ మార్చుకోవటం, మారిన ఎడ్రస్ ఫ్రెండ్స్‌కీ, రిలేటివ్స్‌కీ తెలియపరచడం ... ఇవన్నీ అయి ఫిజికల్‌గా సెటిల్ అయి రొటీన్‌లో పడటానికి నెలపైనే పడుతుంది.

ఇందులో ఇంకో చిన్న ఇబ్బంది కూడా ఉంది. ఇల్లు మారినప్పుడల్లా ఓనర్స్ రెండు మూడు నెలల అద్దె అడ్వాన్స్ అడుగుతారు. ఇంట్లోకి చేరాక ఒకవేళ ఏ కారణంచేతనైనా ఖాళీ చేయాలనుకుంటే, మనకి నచ్చిన ఇల్లు దొరగ్గానే వెంటనే ఈ ఇల్లు ఖాళీ చేయటానికి ఉండదు. కానీ, లేటయితే అవతల ఆ ఇల్లు ఎవడైనా కొట్టుకుపోతాడేమో అని కంగారు! దాంతో అధమం ఒక నెల అద్దయినా వదులుకోక తప్పదు. ఇన్ని ఇబ్బందులుంటాయనే ఇల్లు మార్చటమంటే భయం! కానీ, తప్పలేదు.

నిజానికి ఎల్లారెడ్డి గూడాలో ఉన్న ఈ ఇంట్లోకొచ్చి అయిదు

నెలలయింది. అంతే! కాస్త ఇరుకన్న మాటే కానీ మొదట ఈ ఇంట్లోకి వచ్చేముందు అందరికీ అన్నీ నచ్చాయి. తీరా వచ్చాక ఇబ్బందులన్నీ తెలిసొచ్చాయి. లిఫ్ట్ లేకపోవడంతో మూడో ఫ్లోర్‌లో ఉన్న మాకు పైకి, కిందకీ తిరగటం చాలా ఇబ్బందవుతోంది. మాకున్నది ఒకటే స్కూటర్. మామూలుగా ఆఫీసుకి ఆయన దానిమీదే వెళ్తారు. కానీ మా వాడికి ఎప్పుడైనా కాలేజీలో పార్టీలూ, గ్రా ఉంటే ఆ స్కూటర్ ఆ రోజు వాడిదే. కాబట్టి రోజూ ఇద్దరిలో ఎవరో ఒకరు మెయిన్ రోడ్డుమీద బస్టాండ్‌కి నడిచి వెళ్లాలి. అలాగే నాకు కూరగాయల మార్కెట్ కూడా దూరమే. అన్నిటికన్నా ముఖ్యమైన విషయం ఏమిటంటే ... ఈ ఏడాది మా అమ్మాయికి పంతొమ్మిది నిండాయి. ఇక దానికి సంబంధాలు చూడటం మొదలెట్టాలి. "ఎవరైనా పెళ్లి చూపులకొస్తే వాళ్లు కూర్చుంటే తిరగటానికుండదు. పైగా, అటూ ఇటూ వాళ్ల ముందునుంచే తిరగాలి!" అని నేనన్న మాటలు ఆయనకీ నిజమే అనిపించాయి. దాంతో మళ్లీ ఇళ్లవేట మొదలయింది.

"సాయంత్రం మనం ఆ ఇల్లు చూడటానికి వెళ్తున్నాం. అందరూ జాగ్రత్తగా చూసుకోండి. తీరా ఇంట్లోకి మారాక నెలరోజులకే నసగడం మొదలెడితే ఊరుకోను!" అన్నారాయన పైకి లేస్తూ.

000

"ఫెంటాస్టిక్! చాలా బాగుంది ...!" అన్నాడు మా వాడు బయటునుంచే ఇల్లు చూసి. ఎదురుగానే మెయిన్ రోడ్డు మీద బస్టాండ్ ఉంది. అదీ వాడి ఆనందం.

గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న టూ బెడ్‌రూమ్ అపార్ట్‌మెంట్ అది. ముందు డ్రాయింగ్ రూము. దాదాపు అంతే ఉన్న హాలు. హాల్లోంచి బెడ్‌రూమ్‌కీ, కిచెన్‌కీ దారి. రెండు బెడ్‌రూమ్స్‌కి అటాచ్డ్ టాయ్‌లెట్స్.

"బాగుంది. తూర్పుకి దేవుడు గూడు కట్టించారు. కిచెన్ ప్లాట్‌ఫామ్ కూడా తూర్పుకే ఉంది. కిచెన్‌లో షెల్ఫ్సు కూడా చాలానే ఉన్నాయి!" అన్నాను సంతృప్తిగా.

అది దక్షిణవైపు ఆఖరి అపార్ట్‌మెంట్ కావటంతో అటువైపునుంచి గాలి పుష్కలం.

"దక్షిణం గాలి చాలా మంచిదంటారు...!" అన్నాను.

"మా బెడ్ రూమ్ కూడా బాగుంది!" అన్నాడు మా వాడు.

"వాటర్ రోజంతా వస్తాయట. మునిసిపల్ వాటర్ కూడా ఇళ్లలోకే సప్లయ్ చేస్తారట!" అన్నారాయన.

"కూరగాయల మార్కెట్ కూడా ఇక్కడికి దగ్గరే ... నాకు తెలుసు!" అన్నాడు మా వాడు.

"మరింకేం ... అన్నీ బాగానే ఉన్నాయి. అడ్వాన్సిచ్చేద్దాం!" అన్నాను.

"కంగారుపడకు! అన్నీ జాగ్రత్తగా చూసుకో. మళ్లీ రేపు వచ్చాక, రెండో రోజు నుంచీ గొణగడం మొదలెడితే ఊరుకోను!" అన్నారాయన గట్టిగా.

"అబ్బే ... లేదు లేదు. ఈ ఇల్లు బానే ఉంది!" అంటూ మా అమ్మాయితో ... "అన్నట్టు నువ్వేమీ మాట్లాడవేమే...? ఇల్లు నచ్చిందా?" అన్నాను.

నవ్వి ఊరుకుందది. దానివన్నీ వాళ్ల నాన్న పోలికలు. ఓ పట్టాన తొణకదు, బెణకదు.

000

ఆ ఆదివారం ఇల్లు మార్చేశాం.

ఆ మర్నాడు పొద్దున్నే ... ఆయన గడ్డం గీసుకుంటున్నారు. నేను వంట ప్రయత్నంలో ఉన్నాను.

హఠాత్తుగా పెద్ద చప్పుడు మొదలైంది. ఉలిక్కిపడ్డాం అంతా.

బయటకొచ్చి చూసేసరికి, మా అపార్ట్‌మెంట్ పక్కనున్న రేకుల షెడ్‌లోంచి వస్తోందా చప్పుడు. భరించలేక చెవులు మూసుకుంటూ లోపలకొచ్చి తలుపులు వేసేసుకున్నాం.

మధ్యాహ్నం ఒంటిగంటయినా ఆ చప్పుడు తగ్గలేదు సరికదా పెద్ద వర్షం మొదలైంది ... జల్లు పడుతుంటే కిటికీ తలుపులు మూసేశాను. కాసేపటికి హాల్లోకి నీళ్లు రావటం మొదలయింది. ఎక్కడనుంచా అని చూస్తే, ఆ దక్షిణంవైపు కిటికీ కింద అంచునుంచి లోపలకు జారుతున్నాయి.

సాయంత్రం ఆయన ఆఫీసు నుంచి వచ్చేసరికి హాలంతా నీళ్లమయం.

"కిటికీకి బయట సన్ షేడ్ కట్టలేదేమో?" అన్నారాయన విషయం చెప్తే.

వర్షం కాస్త తగ్గుముఖం పట్టింది. నేను హాలు గుడ్డతో తుడుస్తుండగా మా వాడు కాలేజ్ నుంచి వచ్చాడు. వస్తూనే, "అమ్మా! ఏమిటే ఏదో వాసనేస్తోందీ?" అన్నాడు.

"అవును, నిజమే!" అన్నారాయన కూడా.

ఏదో అనుమానమొచ్చి ఆ దక్షిణంవైపు కిటికీ తెరిచేసరికి గుప్పున లోపలకి వచ్చింది మురికి వాసన!

గబుక్కున తలుపేసేశాను.

"ఇదేంటండీ ఖర్మ...!" అన్నానాయనతో.

"ఉండు, కేర్‌టేకర్‌ని అడిగొస్తాను!" అని కిందకెళ్లారాయన.

పది నిముషాల తర్వాత పైకొచ్చిన ఆయన్ని అడిగాను "ఏమన్నాడు?"

"ఆ పక్క రేకుల షెడ్‌లో ఏదో ఫ్యాక్టరీ ఉందట. ఈ చప్పుడు రోజూ తప్పదు మనకు."

"మరి ఆ రోజు మనం ఇల్లు చూసుకోడానికి వచ్చిన రోజు ఈ చప్పుడు లేదు కదా?"

"ఆ రోజు ఆదివారం."

"మరి నిన్న ఇల్లు మారినప్పుడూ .."

అనబోయి మధ్యలో ఆగిపోయా నిన్నా ఆదివారమే.

"ఆ దక్షిణంవైపు మురికి గుంట ఉందట. అది వర్షం వచ్చినప్పుడల్లా నిండిపోయి వాసన వస్తుందట."

"అయ్యో! దక్షిణంవైపు గాలి మంచిదని సంబరపడ్డాం గానీ, అక్కడున్న మురికి గుంటను చూడలేదు!" అన్నాను నిట్టూరుస్తూ.

ఆయనేం మాట్లాడలేదు.


"అన్నీ బాగున్నాయనుకున్నాం. ఇంట్లో చేరాక ఇబ్బందులన్నీ తెలుస్తున్నాయి!" అనుకున్నాను నాలో నేనే పైకి.

000

ఆ రోజు పొద్దున్ననుంచీ నాకు చాలా కంగారుగా ఉంది. ఆయన కూడా ఆఫీసుకి వెళ్లలేదు. ఏదైనా అవసరమైతే ఉంటాడని మా అబ్బాయిని కూడా కాలేజ్‌కి వెళ్లద్దన్నాను.

మధ్యాహ్నం రెండింటికి వస్తామన్నారు వాళ్లు. ఈ లోపు పనులన్నీ అవుతాయా, లేదా అని నాకు కంగారు.

"పెళ్లి చూపులకే ఇంత హడావుడి చేస్తున్నావ్, ఇంక అసలు పెళ్లికి మమ్మల్ని నిలవనిస్తావో, లేదో!" అన్నారాయన.



పైకి అలా అంటున్నారు కానీ, ఆయనకి కూడా లోపల టెన్షన్‌గానే ఉన్నట్టు ఆయన మొహం చెబుతోంది. కానీ, నాకు ఆశ్చర్యంగా ఉన్న విషయమేమిటంటే, మేమింత హడావుడి పడుతుంటే మా అమ్మాయి మాత్రం మంచంమీద బోర్లా పడుకుని కాళ్లూపుతూ టీ.వీ. చూడటం.

"ఏమే ... మేమింత కంగారుపడుతుంటే, అసలుదానివి నీకు చీమకుట్టినట్టయినా లేదా?" అన్నాను.

"హడావుడి ఎందుకమ్మా? మేమిద్దరం ఒకళ్లకొకళ్లం నచ్చితేనే కదా పెళ్లవుతుంది. అవునా! నేను కంగారు పడిపోయినంత మాత్రాన వాళ్లకి నచ్చేస్తానా? ఒకవేళ నేను వాళ్లకి నచ్చాననుకో, నేను కంగారు పడలేదని నన్ను పెళ్లి చేసుకోవటం మానేస్తారా?" అంది నవ్వుతూ.

"బాగుంది తల్లీ! ఈమాత్రం బుద్ధి మాకు లేకపోయింది!" అన్నాను లెంపలేసుకుంటూ.

మధ్యాహ్నం రెండున్నరకి వచ్చారు వాళ్లు. నా బలవంతంమీద కాస్త మేకప్ చేసుకుని చీర కట్టుకుందది. అసలీ కాలం అమ్మాయిలు ఇంత గంభీరంగా ఎలా ఉండగలుగుతారో తెలియదు. ఆ పిల్లాడిని ఏ తలుపు చాటునుంచో చూడాలని తొందర లేదు దానికి.

టిఫిన్లూ, కాఫీలూ అయ్యాక వచ్చి కూర్చుంది. కాసేపు వాళ్లు మామూలుగా అడిగే ప్రశ్నలన్నీ అడిగారు. అన్నిటికీ ఇది బాగానే సమాధానం చెప్పింది.

అబ్బాయి చూడటానికి బాగానే ఉన్నాడు. సరదాగానే మాట్లాడుతున్నాడు. వాళ్ల కుటుంబం కూడా సంస్కారవంతుల్లాగానే అనిపించారు.

ఆయన సైగ చేయటంతో అది లోపలకెళ్లిపోయింది.

కాసేపు కబుర్లయ్యాక మేం అసలు విషయం దగ్గరకి వచ్చాము. మేమియ్యదలచుకున్న దానికన్నా కొంచెం ఎక్కువే ఆశిస్తున్నారు వాళ్లు. కానీ ఆయనకది సమ్మతంగానే అనిపించినట్టుంది.

నాలుగున్నరకి వాళ్లు బయలుదేరటానికి సిద్ధమవుతుంటే మా అబ్బాయి వచ్చి నా చెవిలో నెమ్మదిగా చెప్పాడు "అక్క నిన్నోసారి లోపలకి రమ్మంటోంది!"

నేను నెమ్మదిగా లేచి లోపలకు నడిచాను.

"ఏమిటే...?" అన్నాను హడావుడిగా.

"అమ్మా, నువ్వు కాస్త ప్రశాంతంగా విను. నేనోసారి అతనితో మాట్లాడాలి...!"

నాకు నోట మాట రాలేదు.

"ఏమిటే నువ్వంటున్నది?" అని మాత్రం అనగలిగాను.

"అవునమ్మా.... నేనోసారి అతనితో పర్సనల్‌గా మాట్లాడాలి!" ఖచ్చితంగా అంది.

"ఏం మాట్లాడతావే?" అనుమానంగా అడిగాను.

"అమ్మా, మీ వైఖరి చూస్తుంటే అతను మీకు నచ్చినట్టే నాకనిపిస్తోంది. వాళ్లడిగినంత కట్నం కూడా ఇవ్వడానికి నాన్న ఆల్‌మోస్ట్ రెడీగా ఉన్నారు. ఒకవేళ అతను కనుక రేపు నేను నచ్చానని చేస్తే మా పెళ్లయిపోతుంది. అవునా?"

"అవును!" అని నేనంటూండగా ఆయన లోపలికి వచ్చారు.

"మరి నాకతను నచ్చాడో, లేదో మీరు నన్నడిగారా అమ్మా?"

.......

"ఫరవాలేదమ్మా! కంగారుపడకు. నాకతను నచ్చాడు. కానీ నేనోసారి అతనితో మాట్లాడాలి."

నాకేమనాలో అర్థంకాక ఆయనకేసి చూశాను. అప్పటికే ఆయనకంతా అర్థమైంది.

"చూడమ్మా, నువ్వడిగినదాంట్లో ఏమీ తప్పులేదు. కానీ ఓసారి పర్సనల్‌గా మాట్లాడాలని అతను అడిగి ఉంటే ఎవరికీ అభ్యంతరం ఉండేది కాదు!"

"అందుకనే నేనిప్పటిదాకా ఆగాను, నాన్నా! కానీ అతనికా ఉద్దేశం ఉన్నట్టు లేదు. అందుకే నేనే అడిగాను."

"మనమిలా అడిగితే వాళ్లేమనుకుంటారో!" అంటున్న నన్ను మధ్యలోనే ఆపి, "అమ్మా...! ఇందులో అనుకోవడానికేముంది? వాళ్లడిగితే మీరు ఒప్పుకునేవారు కాదూ?" అంది.

"అయినా నువ్వేం మాట్లాడతావే? పెద్దవాళ్లం మేం అన్ని విషయాలూ వివరంగా మాట్లాడుతున్నాం కదా!"

"అమ్మా! ఈ పెళ్లయితే అతనితో జీవితాంతం కాపురం చెయ్యాల్సింది నేనమ్మా! మీరెవరూ కాదు. ఆ విషయం, మీరంతా మర్చిపోతున్నారు. అతనేమిటో, అతని అభిరుచులేమిటో, అభిప్రాయాలేమిటో తెలియదు. మా ఇద్దరి మనస్తత్వాలూ కలుస్తాయో లేదో తెలియదు. హఠాత్తుగా ఈ వేళ ఒకళ్లనొకళ్లు చూసుకున్నాం. అన్నీ కుదిరితే రెండు మూడు నెలల్లో మా పెళ్లయిపోతుంది. అంతే ! ఇక ఆ తర్వాత జీవితాంతం నేనతనితో గడిపెయ్యాలి. ఇదంతా .... ఇలా ఓ సడెన్ యాక్సిడెంట్‌లా హడావుడిగా నా నిమిత్తం లేకుండా ఇంత నిర్లిప్తంగా జరిగిపోవడం ... నో ... కాంట్ బిలీవిట్!"

"అమ్మా! ఈ ఇల్లు చూసుకోడానికి వచ్చినప్పుడు నువ్వు నన్ను - ఇల్లు నచ్చిందా? అని అడిగావు గుర్తుందా. నేను నవ్వి ఊరుకున్నాను. ఎందుకంటే ఈ ఇల్లు నాకు నచ్చినా, నచ్చకపోయినా నేనిక్కడ కలిసి ఉండబోయేది నా వాళ్లయిన మీ అందరితో. కాబట్టి నాకే ఇబ్బందీ లేదు. కానీ, ఈ పెళ్లయ్యాక నేను కలిసి బతకబోయేది అతనితోనే. కేవలం అతనొక్కడితోనే ..."

మేమెవ్వరం మాట్లాడలేదు.

"అమ్మా...! మనం ఈ ఇంట్లో ఎన్నాళ్లుంటామో మనకి తెలియదు. కానీ మనం ఇందులోకి వచ్చే ముందు ఎన్ని రకాలుగా ఎన్ని వైపులనుంచి ఆలోచించాం ... మంచి సెంటర్‌లో, బస్టాండ్‌కి దగ్గర్లో, కూరగాయల మార్కెట్‌కి దగ్గరగా, గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉండేలా .... ఇంకా చుట్టుపక్కల ఎవరున్నారో ... ఇన్ని చూసి అన్నీ నచ్చి తృప్తి పడ్డాక ఇంట్లోకి దిగాం. బయట నుంచి చూడటానికి అన్నీ బాగానే అనిపించాయి. కానీ ప్రాక్టికల్‌గా ఉండటం మొదలెట్టాక ఇబ్బందులన్నీ తెలిసొచ్చాయి. ఒకటీ .... టెంపరరీగా ఉండే ఇల్లుకోసమే మనమంతా ఇంతమంది, ఇన్నివైపులనుంచి ఆలోచించాం. అయినా కూడా మన నిర్ణయం తప్పయింది. అలాంటప్పుడు పర్మనెంట్‌గా కలిసి ఉండబోయే మనిషిని ఇంత హఠాత్తుగా ఏ ధైర్యంతో ఎలా నిర్ణయించేసుకోమంటావ్ నాన్నా?"

"ఇల్లు నచ్చకపోతే ఎడ్జస్ట్ అవుతాం. మరీ నచ్చకపోతే వేరే ఇల్లు చూసుకుంటాం. కానీ, పెళ్లి నచ్చకపోతే ఆ అవకాశం ఉండదు. ఉన్నా, అదంత సులభం కాదు!"

దాని ఆఖరి మాటలు నాకు నిజమే అనిపించాయి. ఆయనేమంటారోనని చూసేసరికి ఆయనక్కడ లేరు .... అప్పటికే బయటకి నడుస్తున్నారు ...

000

"అమ్మాయి ఒకసారి అబ్బాయితో పర్సనల్‌గా మాట్లాడుతుందిట ..." అన్నారాయన పెళ్లికొడుకు తండ్రితో. ■

